# స్పర్శ

మధ్యాహ్నం ఒకటిన్నర కావస్తోంది. వర్షాకాలం... రెండురోజులుగా కుంభవృష్టితో అల్లల్లాడిన జనం ఆవేళ కొంచెం ఎండ రావడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఎండ ప్రియురాలి కౌగిలిలా నులివెచ్చగా ఉంది. కాత్యాయిని వీధిగుమ్మం అరుగు మీద ఆ స్పర్శలో చలికాచుకుంటూ కూర్చుంది. ఆమె కళ్లు వీధి చివరన అతుక్కుని ఉన్నట్టుగా దృష్టి తదేకంగా ఉంది. ఎవరికోసమో ఆత్రంగా ఎదురుచూస్తున్నట్టుగా ఆమెని చూస్తేనే తెలిసిపోతోంది. కొద్దిగా ఆ కళ్లల్లో అసహనం, విసుగు కూడా కనిపిస్తోంది. హఠాత్తుగా సైకిల్ బెల్ మోగింది. ఆమె కళ్లల్లో ఆశ రెపరెపలాడింది. కానీ, మళ్లీ కొన్ని సెకన్లలోనే ఆశ అంతరించింది. నిరాశ మబ్బులా కమ్మింది. ఎవరో కుర్రాడు సందు మలుపు తిరిగి వెళ్లిపోయాడు.

"వెధవ... ఏమొచ్చిందో ఇవాళ కూడా రాలేదు..." అనుకుంది విసుగ్గా.

అయినా ఎదురుచూడడం మానను అన్నట్టుగా అక్కడే అలాగే కూర్చుని ఉండిపోయింది.

ఇవాళ ఒకటో తారీకు. గతనెల సరిగ్గా ఇదేరోజున పట్టాభిరామయ్య రిటైర్ అయాడు. ఆరోజు కలగని దిగులేదో కలిగినట్టు అయింది ఆవిడకి. ఆరోజు మెడలో వేసిన పూలదండలు చేతులమీద వేసుకుని, శాలువా భుజాన కప్పుకుని ఇంట్లోకి వస్తూనే రేపట్నించి నీకు బోలెడు కాలక్షేపం అంటూ నవ్వాడు.

ఉన్న ఇద్దరు పిల్లలు ఉద్యోగాల పేర విదేశాలకు వెళ్లిపోవడంతో కాత్యాయిని దిగులు పెట్టుకుంది. అందులోనూ మనవరాలు నవ్య కూడా తల్లిదండ్రులతో వెళ్లిపోవడం ఆవిడకి అసలు నచ్చలేదు. ఏడాదిపాటు అరచేతుల్లో పెంచుకుని, కళ్లల్లో పెట్టుకుని అపురూపంగా చూసుకుంది. ప్రాణానికి ప్రాణంగా భావించింది. అసలు కూతురు అలా నిర్దయగా తననుంచి ఆ పిల్లను తీసుకుని అన్ని వేల మైళ్ల దూరం వెళ్తుందని ఆవిడ అసలు ఊహించలేదు. అనుకోకుండా ఓ రోజు అటు కొడుకు, కోడలు, ఇటు అల్లుడు, కూతురు వచ్చి మాకు అమెరికాలో ఉద్యోగం దొరికింది వెళ్తున్నాం అనగానే కుప్పకూలి పోయింది. దుఃఖంతో స్వరం

మూగబోయింది. ఎందుకు? ఎందుకు మీరంతా అంత దూరం వెళ్లడం... మన ఊరు గొడ్డుపోయిందా? ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాలకి ఏమైంది? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

అప్పటికే నలుగురూ హైదరాబాదులో ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. దాదాపు ప్రతి పండక్కీ కనీసం ఒక్కరోజైనా నలుగురూ వచ్చి వెడుతోంటే ఇల్లంతా కళకళ్లాడుతూ ఉందని పొంగిపోయింది. కూతురు మాధవి నెలతప్పిందని తెలియగానే, పాపాయిని నేనే పెంచుకుంటా అంటూ మురిసిపోతూ చెప్పింది. ఏడాదిపాటు గుండెల్లో పెట్టుకుంది. కానీ, వాళ్లలా హఠాత్తుగా తన నెత్తిమీద బండరాయి పడేస్తారని ఆవిడ కలలో కూడా అనుకోలేదు.

అమ్మా... ఇప్పుడున్న ఉద్యోగాలు బాగానే ఉన్నాయి. కానీ, అక్కడ ఉద్యోగం ఇంకా బాగుంటుంది. ధరలు చూశావా ఎలా పెరిగిపోతున్నాయో... మనం ఎంతకాలం ఈ పాతకాలం పెంకుటింట్లో ఉంటాం. ఈ పెంకులు తీసి డాబా వేసుకోడానిక్కూడా మన దగ్గర డబ్బులు లేవు. అందుకే, అమెరికా వెడితే బోలెడు డబ్బులు సంపాదించుకుని, మంచి ఇల్లు కట్టుకోవచ్చు. ఇక్కడకాదు... హైదరాబాద్‌లో కట్టుకుందాం మంచి ఇల్లు... చూశావా.. నీ మెడలో నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా ఈ పాత గొలుసు తప్ప ఒక్క నల్లపూసల గొలుసు చేయించుకున్నావా? మమ్మల్ని చిన్నప్పటి నుంచి అష్టకష్టాలు పడి పెంచిన నిన్ను, నాన్నని మేము ఇప్పుడైనా సుఖపెట్టాలంటే అక్కడికి వెడితేనే సాధ్యం అంటూ మాధవి, కొడుకు కిరణ్ ఒక పక్క, అల్లుడు, కోడలు మరోపక్క అమెరికా వెడితే కలిగే లాభాలు ఎంతో ఓపిగ్గా, వివరంగా చెప్పి, తనని బలవంతంగా ఒప్పించారు. నీకెందుకు వెళ్లగానే వారానికో ఉత్తరం రాస్తాం. రెండురోజులకోసారి ఫోన్ చేస్తాం అంటూ వాగ్దానాలు చేశారు.

ఏదీ... వెళ్లి రెండేళ్లవుతోంది... అన్నట్టుగానే వెళ్లిన కొత్తల్లో వారానికో ఫోన్ మాత్రం చేశారు. ఈ రెండేళ్లలో నాలుగుసార్లు ఉత్తరాలు రాశారు. మళ్లీ ఉత్తరాలేవీ? ఆవిడ కళ్లు మళ్లీ వీధి చివరకు మళ్లాయి. అక్కడనుంచి కొంచెం ముందుకువెడితే రోడ్డు వస్తుంది. రోడ్డుకి ఎడంవైపు కొంచెం దూరం వెళ్లి, మళ్లీ ఎడం పక్కకి తిరిగితే బ్యాంకు, రోడ్డు కుడి పక్క నుంచి మరి కొంచెం దూరం వెడితే పోస్టాఫీసు... ఆ పోస్టాఫీసు నుంచి ఉత్తరాల కట్టలు మోసుకొచ్చే సింహాచలం కోసం ప్రతిరోజూ ఆ సమయానికి అలా వీధి వాకిట్లో ఎదురు చూడడం ఆవిడ దినచర్యలో ఓ భాగమైంది.

ఏం పిల్లలో! వెళ్లేటప్పుడు ఎంతగా నచ్చచెప్పారు? ఎన్ని కబుర్లు చెప్పారు.

వెళ్లిం దగ్గర్నించి ఆ కబుర్లు ఏమయాయో... ఏవన్నా అంటే బిజీ అమ్మా... టైం లేదు అనడం... ఎంత బిజీగా ఉంటే మాత్రం తల్లిదండ్రులకి ఉత్తరాలు రాసుకోరా, దగ్గరా? దాపా కొన్ని వందల వేల మైళ్ల దూరంలో ఉన్నారు... ఎలా ఉన్నారో, ఏం చేస్తున్నారో... పల్చగా కమ్మిన కన్నీటి తెర మధ్య పరిసరాలన్నీ అస్పష్టంగా కనిపించాయి. సైకిల్ బెల్ మోగడంతో ఉలిక్కిపడి మళ్లీ ఆశగా చూసింది. ఆవిడ కళ్లల్లో ఆనందం చిన్న మెరుపులా వచ్చి చేరింది.

"అమ్మగారూ... మీకేం లేవండి" బిగ్గరగా అనేసి బెల్ మోగించుకుంటూ ముందుకు సాగిపోయాడు పోస్ట్‌మాన్ సింహాచలం.

"ఒరేయ్ సింహాచలం..." ఆవిడ పాతకాలం గేటు దగ్గరకు వడివడిగా వచ్చింది.

ఎదురింటి గేటు ముందు సైకిల్ ఆపి, గేటు తోసుకుని లోపలికి వెళ్లి ఉత్తరాలు ఇచ్చి వస్తోన్న సింహాచలం మళ్లీ అన్నాడు... 'మీకేం ఉత్తరాలు రాలేదండి.'

'నీ మొహం సరిగ్గా చూడు' విసుగ్గా అందావిడ.

నవ్వాడు సింహాచలం. 'అమ్మగారూ! నమ్మకం లేదేంటండి.. ఇలా చూడండి. అసలు కట్టే పలచబడింది. అందులోనూ అమెరికా నుంచి ఉత్తరాలు ఎవరికీ రావడంలేదు. అయినా చాదస్తం కానీ, కంప్యూటరు పెట్టించుకోండి అంటే వినరేంటండి? కాలం మారిపోయింది. కంప్యూటర్లో గంటలు, గంటలు మాట్లాడుకునే రోజులివి... మీరింకా ఉత్తరం ముక్క కోసం ఎదురుచూత్తారేం టండి?' తనకి తెలిసిన విజ్ఞానం అంతా రెండు ముక్కల్లో గబగబా అనేసి తిరిగి బెల్ మోగించుకుంటూ సైకిల్ ముందుకి పోనిచ్చాడు.

కాత్యాయనికి ఏమీ అర్థంకాలేదు. కంప్యూటర్లో మాట్లాడుకోడం ఏంటి? వీడొకడు అడిగిన దానికి సమాధానం చెప్పకుండా ఏవిటో మాట్లాడతాడు. విసుగ్గా అనుకుంటూ తిరిగి సందు చివర వైపు చూపు తిప్పింది. ఈయనగారు ఇంకా రాలేదేంటో... ఆకలేస్తోంది. మళ్లీ వర్షం పడితే కష్టం అనుకుంది. అప్పుడే వీధి చివర నుంచి వస్తూ కనిపించాడు పట్టాభిరామయ్య.

కాత్యాయని అరుగుమీంచి లేచి, లోపలికి నడిచింది. డైనింగ్ టేబిల్ మీద కంచాలు, మంచినీళ్లు పెట్టింది. ఆవిడకి చాలా దిగులుగా అనిపించింది. ఎంతకాలం ఇలా లింగు లిటుకుమంటూ ఇద్దరే ఉండడం... పిల్లలతో కళకళ్లాడిన ఇల్లు... అప్పుడే రెండేళ్లు... 'ఎంతోకాలం ఉండమమ్మా, డబ్బులు సంపాదించుకుని,

అందరం ఇళ్లు కొనుక్కుని, కొంత పిల్లల భవిష్యత్తు కోసం దాచుకుని వచ్చేస్తాం. అప్పుడు అందరం హాయిగా ఉండచ్చు...' కిరణ్ మాటలు గుర్తొచ్చాయి. మీరు ఇక్కడ లేనప్పుడు నాకే ఇల్లు అయితే ఏంరా తలదాచుకోడానికి అనుకుంది.

తన పెళ్లయి కాపురానికి వచ్చింది ఇక్కడికే అత్తగారు, మావగారు, ఇద్దరు బావగార్లు, పెద్ద బలగం... అందరి పెళ్లిళ్లు, పురుళ్లు ఇక్కడే అయాయి. తనకి బంగారంలాంటి ఇద్దరు పిల్లలు ఇక్కడే పుట్టారు. వాళ్ల పెళ్లిళ్లు ఇక్కడే అయాయి. అత్తగారు, మావగారు మెసిలిన ఇల్లు... వాళ్లు లేకపోయినా అడుగడుగునా వాళ్ల జ్ఞాపకాలు... వాళ్ల మంచితనం ఈ ఇంట్లోంచి ఎక్కడికి వెళ్తుంది తను? పిల్లలు మహారాజా భవనం కట్టించినా తను వెళ్లదు... ఈ కట్టె ఇక్కడే రాలిపోవాలి. తనక్కావాల్సింది పిల్లలు, వాళ్ల సందడి. కొడుకూ, కోడలు, మనవడు, మనవరాలు అత్తగారిలాగా తను కూడా అందరితో ఆనందంగా బతకాలి. పండగలకి వచ్చిపోతూ కూతురు, అల్లుడు, వాళ్ల పిల్లలు... పిల్లల్ని మించిన సంపద ఈ ప్రపంచంలో ఏం ఉంది? ఏ ఆడదానికైనా నగలు, చీరలు ఎన్ని ఉన్నాయని ఎవరన్నా చూస్తారా? ఎంతమంది పిల్లలున్నారు, వాళ్లేం చేస్తున్నారు? అని చూస్తారు. ఏంటో తన బాధ ఎవరూ అర్థం చేసుకోరు.

చెప్పుల చప్పుడుకి తల తిప్పి చూసింది. 'ఇంతసేపు ఎక్కడికి వెళ్లారండి?' లోపలికి అడుగుపెడుతోన్న పట్టాభిరామయ్యని అడిగింది.

'నీ కోసం ఒక మంచి బహుమతి తెస్తున్నానోయ్... హుషారుగా చెప్పాడు చొక్కా గుండీలు విప్పుతూ.

ఆవిడ విరక్తిగా నవ్వింది. 'నన్ను సంతోషపెట్టే బహుమతి ఈ ప్రపంచంలో ఏం ఉందండి? నా పిల్లలు తప్ప?'

'అదే... వాళ్ళనే తెచ్చాను.'

గిరుక్కున ఆయనవైపు తిరిగి, చరచరా నడిచి వచ్చి ఆయన చేయి పట్టుకుని సంభ్రమంగా "పిల్లలొస్తున్నారా?" అడిగింది.

ఆయన నవ్వుతూ "ఊ... రేపు మధ్యాహ్నానికల్లా వస్తారు" అన్నారు

"అలాగా... మీకెలా తెలుసు? ఉత్తరం రాశారా? ఫోన్ చేశారా?" ఉత్సాహం ఉరకలు వేస్తోంటే గబగబా ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఎందుకంత ఆరాటం?రేపటి దాకా ఆగవచ్చుకదా..." నవ్వుతూ బాత్ రూమ్ వైపు వెళ్లిపోయాడు పట్టాభిరామయ్య.

కాత్యాయిని పరవళ్లు తొక్కుతున్న ఉత్సాహంతో కంచాల్లో అన్నం, పదార్థాలు వడ్డిస్తూ ఆయన బాత్‌రూమ్‌లో ఉన్న విషయం మర్చిపోయినదానిలా ప్రశ్నలు కురిపిస్తూనే ఉంది. కాళ్లు, చేతులు కడుక్కొచ్చిన పట్టాభిరామయ్య భార్య ఆనందం చూస్తూ పిచ్చిది... పాపం పిల్లల కోసం కలవరిస్తోంది. రేపీపాటికి వాళ్లని చూస్తుంది. ఇంతకాలం తన మాట జవదాటకుండా, తనని, తనవాళ్లని కళ్లల్లో పెట్టుకు చూసుకున్న ఈ అమాయకురాలికి తనిచ్చే బహుమతి ఎంత ఆనందాన్నిస్తుం దో...ఆలోచిస్తూ భోజనం ముగించాడు.

మర్నాడు ఉదయాన్నే లేచి జంతికలు, రవ్వలడ్లు చేసింది కాత్యాయని. పిల్లల కిష్టం అని కందిపచ్చడి రుబ్బింది.

"ఏవండీ... ఎన్నింటికి వస్తారు? వంట చేసేయనా? వాళ్లొచ్చేటైంకి చల్లారి పోతుందేమో వచ్చేముందు చేయవచ్చుకదా" అంది.

ఆయన తెల్లబోయాడు. తనెంత తెలివితక్కువవాడు. పిల్లలొస్తున్నారంటే నిజంగా వాళ్లే వస్తున్నారనుకుంటోంది. తను తెస్తున్నది కంప్యూటర్ అని, దానికి ఇంటర్‌నెట్ కనెక్షన్ పెట్టించి, వెబ్‌కామ్ కొన్నాడని తెలిస్తే ఏం చేస్తుందో... ఎంత పని చేశాడు తను... కాత్యాయని హడావుడి పడకు నా మాట విను... పిల్లలు...

"అబ్బా... నా టైం వృధా చేయకండి. మీ సొదతో... నాకు బోలెడు పనుంది" అంటూ హాల్లోకి వెళ్లిపోయి పనిమనిషి సాయంతో బూజులు దులప సాగింది.

ఆయనకేం చేయాలో కాత్యాయనికి ఎలా చెప్పాలో అర్థంకాలేదు. అక్కడికీ రెండు, మూడుసార్లు తను చేయబోతున్న పని వివరించబోయాడు కానీ ఆమె వినలేదు. ఆయన బిక్కుబిక్కుమంటూ అటూ, ఇటూ తిరగసాగాడు.

పదకొండున్నర అవుతుండగా కరణంగారి అబ్బాయి సత్యనారాయణ పిలుపు వినిపించి గబుక్కున వీధి వాకిట్లోకి వచ్చాడు. బండిమీద ఇంకో కుర్రాడిని ఎక్కించుకుని, కంప్యూటర్‌తోసహా వచ్చాడు సత్యనారాయణ. 'రా సత్యం..." అంటూ భయంభయంగానే వాళ్లని ఆహ్వానించాడు.

'ఎక్కడ పెట్టమంటారు?' అడిగాడు సత్యనారాయణ.

'ఏంటండి అది?' సందేహంగా చూసింది కాత్యాయని.

'ఇది మ్యాజిక్ బాక్స్ ఆంటీ... కొంచెంసేపు మీరు కళ్లు మూసుకుని

కూర్చోండి... గొప్ప మ్యాజిక్ జరుగుతుంది' అన్నాడు సత్యనారాయణ.

'మ్యాజిక్కా...' అయోమయంగా చూసింది.

ఆయన ఆమె వైపు చూడకుండా కంప్యూటర్ ఎక్కడ పెట్టాలో వాళ్లకి వివరిస్తూ మొహం చాటుచేసుకున్నాడు.

విషయం ఏమిటో అర్థంకాకుండా అయోమయంగా ఉండిపోయిన కాత్యాయని తిరిగి లోపలికి వెళ్లింది. గంట తరువాత 'ఆంటీ...' అంటూ కేకేశాడు సత్యనారాయణ.

'ఏవిటయ్యా అంత కేకేస్తున్నావు?' గాభరాగా వచ్చింది.

'ఇప్పుడు చెప్పండి... మీ మనవరాలు ముందు కావాలా? కూతురా? కొడుకా?'

'అదేంటి? ఏరి వాళ్లు. ఎవరు ముందు కావాలేంటయ్యా నీ ప్రశ్న పాడుగానూ... నీకు కన్ను కావాలా? కాలు కావాలా? అన్నట్టుంది' అంది వీధి వాకిలి వైపు పరుగులాంటి నడకతో వెళ్తూ.

సత్యనారాయణ గట్టిగా నవ్వాడు. "ఇలారండి... ఇరుగో మీ కొడుకూ, కోడలు. మీకోసం వాళ్లు నిద్రపోకుండా ఎదురుచూస్తున్నారు... మాట్లాడండి" అంటూ చెవుల్లో ఫోన్స్ పెట్టాడు.

"అమ్మా... కులాసానా...' కిరణ్ గొంతు వినిపించి కాత్యాయని అణువణువూ పులకించినట్టు అయింది. 'నాన్నా కిరణ్ ఎలా ఉన్నార్రా?'

ఆవిడ స్వరం గాద్గదికం అయింది.

హమ్మయ్య గుండెల మీంచి పెద్ద బరువు దించినట్టుగా నిట్టూర్చాడు పట్టాభిరామయ్య.

ఆవిడ  మాట్లాడుతూనే ఉంది. వాళ్ల ఉత్తరాల కోసం తనెలా ఎదురుచూస్తోంది. తను వాళ్లకోసం ఎంతలా తపిస్తోంది... అన్నీ చెప్తోంది. ఎంత బిజీగా ఉన్నా ఉత్తరం ముక్క రాయలేరా అని దెబ్బలాడుతోంది. ఆయన ముగ్ధుడై చూడసాగాడు. 'నాయనా సత్యం ఒక్కసారి నా చిట్టితల్లిని చూపించవూ'... కొడుకు 'నిద్రొస్తోంది పడుకుంటాను' అన్నాడు కాబోలు, 'అలాగే నాయనా పడుకోండి' అంటూ ఫోన్ తీసి సత్యనారాయణని ప్రాధేయపడింది.

'చూశావా? పిల్లలొస్తున్నారు అన్నాను. వచ్చారు చూశావా? ఇదంతా ఆధునిక విజ్ఞానం మహిమ తెలుసా?' నవ్వుతూ అడిగాడు. ఆవిడ మొహం

మ్లానమైంది.

'ఇదిగో ఆంటీ మాట్లాడండి... మీ అమ్మాయి మాధవి కనిపిస్తోంది చూశారా? అదిగో పాప నిద్రపోతోంది.' అంటూ మళ్లీ ఫోన్ ఆవిడ చెవుల్లో పెట్టాడు.

'అమ్మా... అమ్మా...' మాధవి గొంతు వినిపిస్తోంది. కానీ, కాత్యాయిని స్వరం మాత్రం పైకి రావడంలేదు. దుఃఖం ఉండలా మారి గొంతులో అడ్డు పడింది.

'మాట్లాడు కాత్యాయని, పిల్లలు, పిల్లలు అంటూ కలవరించి ఇప్పుడా ఏడుపెందుకు? ఎంతో సంతోషించాల్సిన సమయం ఇది.'

'అవునాంటీ హాయిగా మీ పిల్లలతో మీరు ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చు. పాపాయికి కథలు చెప్పవచ్చు. వాళ్లని చూడచ్చు. ఉత్సాహంగా చెబుతున్నాడు' సత్యనారాయణ.

"కానీ... కానీ... వాళ్లకోసం పొద్దుట్నించి కష్టపడి చేశానే, ఆ వంటలన్నీ ఎవరు తింటారండి? ఈ కంప్యూటర్, ఈ మైకు, ఈ కెమెరా ఇవన్నీ చాలా గొప్పవే కావచ్చుగాక, కానీ కానీ నా చిట్టితల్లిని ఒక్కసారి నా గుండెలకి హత్తుకుని ఆ స్పర్శలోని మాధుర్యం అనుభవించే అవకాశం నాకీ పెరిగిన ఆధునిక విజ్ఞానం ఇవ్వగలదంటారా?"

పట్టాభిరామయ్య, సత్యనారాయణ, కనెక్షన్ ఇవ్వడానికి వచ్చిన ఇంజనీరు అందరూ ఆవిడ ప్రశ్నకి సమాధానం చెప్పలేనివాళ్లలా నిశ్చేష్టులై నిలబడిపోయారు.

***

*(ఆంధ్రభూమి, 2007)*